క్లుప్తంగా

కల్యాణ మండపం నిర్మించరూ!

- టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డికి వినతి



టీటీడీ చైర్మన్‌ను కలిసిన వైఎస్సార్‌సీపీ నేతలు

పెద్దపంజాణి: మండల కేంద్రంలో కల్యాణ మండపం నిర్మించాలని మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు టీటీడీ చైర్మన్ వైవీ.సుబ్బారెడ్డిని కోరారు. పార్టీ మండల కన్వీనర్ బాగా రెడ్డి, వైస్ ఎంపీపీ జీడీ.బాబు, సర్పంచుల సంఘం అధ్యక్షుడు హరినాథ్ తదితరులు సోమవారం తిరుమలలో వైవీ సుబ్బారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. తాము మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి సహకారంతో పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆదేశాలతో చైర్మన్‌ను కలసినట్లు చెప్పారు. తమ వినతిపై టీటీడీ చైర్మన్ సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు.

నేటి నుంచి భూహక్కు సర్వే

రామకుప్పం: వైఎస్సార్ శాశ్వత భూహక్కు, భూరక్ష సర్వే కార్యక్రమం రామకుప్పంలో మంగళవారం ప్రారంభమవుతుందని సర్పంచ్ మురళీకృష్ణ తెలిపారు. దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టైలరింగ్‌లో శిక్షణకు దరఖాస్తులు

పుంగనూరు: పట్టణ సమీపంలోని గూడూరుపల్లె వద్ద గల ఐటీఐ కళాశాలలో మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు శిక్షకురాలు ధనలక్ష్మి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ ఐటీఐలో స్కిల్ డెవలెప్‌మెంట్ ప్రోగ్రాం కింద శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ కాలంలో ఒక్కొక్కరికి రూ.1000 స్టైఫండ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల మహిళలు శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఒక్కో బ్యాచ్‌కు 30 మందిని మాత్రమే ఎంపిక చేసి శిక్షణ ఇస్తామన్నారు.

దుర్గ ఆలయంలో పూజలు

పలమనేరు: పట్టణంలోని పారోపేట దుర్గ ఆలయ ఆషాఢ నవరాత్రుల్లో భాగంగా స్థానిక ఆలయంలో సోమవారం వరాహిదేవీ పూజలు చేశారు. ఈ పూజల్లో ఆ వార్డు కౌన్సిలర్ నాగరాజు, కేవీ రమణ, ప్రకాష్, వెంకటేష్, యువరాజ్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.


హోటళ్లపై ఆహార కల్తీ నిరోధకశాఖ దాడులు

పలమనేరు: పట్టణంలోని పలు హోటళ్లపై ఆహార కల్తీ నిరోధకశాఖ అధికారులు సోమవారం ఆకస్మిక దాడులను చేశారు. దుకాణాల్లో తూతూమంత్రంగా తనిఖీలు చేసి చేతులు దులుపుకున్నారు. పట్టణంలో డూప్లికేట్ మంచినీటి వాటర్‌బాటిళ్ల వ్యాపారం జోరుగా సాగుతోందని సాక్షి దినపత్రికలో శుక్రవారం 'పేరు ఏమార్చి' శీర్షికతో ప్రచురించిన కథనంపై అధికారులు స్పందించి ఈ దాడులు చేశారు. అయితే ఎన్ని కేసులు నమోదు చేశారు? అనే విషయాలను మీడియాకు చెప్పక పోవడం గమనార్హం!

బస్టాండులో పోలీసుల తనిఖీలు

పలమనేరు: స్థానిక ఆర్టీసీ బస్టాండులో ఇటీవల ప్రయాణికుల స్మార్ట్‌ఫోన్లను చోరీలు చోటుచేసుకోవడంతో సీఐ చంద్రశేఖర్ తన సిబ్బందితో కలసి సోమవారం బస్టాండులో తనిఖీలు చేశారు. ఇదే సమయంలో ఓ వ్యక్తి తన సెల్‌ఫోన్ చోరీ అయిందంటూ పోలీసులకు తెలిపాడు. దీంతో వారు సీసీ కెమెరా పుటేజ్ ఆధారంగా నిందితుడిని పట్టుకొనున్నట్లు పోలీసులు తెలిపారు. బస్టాండు ప్రాంగణంలో దొంగల బెడద పెరిగిందని, వీరిని పట్టుకుని చర్యలు తీసుకుంటామని, ప్రయాణికులు దొంగల బారిన పడకుండా తమ వస్తువులను జాగ్రత్తగా ఉంచుకోవాలని సీఐ కోరారు.

ఉపాధ్యాయులకు సన్మానం



పుంగనూరు: మండలంలోని గూడూరుపల్లె ప్రభుత్వ హైస్కూల్‌లో పనిచేస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులు బదిలీ కావడంతో సోమ వారం వారిని స్థానిక పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు జీవీ రమణ, అమరనాథ్‌ను హెచ్ఎం మహేష్‌నారాయణ ఆధ్వర్యంలో విద్యార్థులు పూలు చల్లి వీడ్కోలు పలికారు.

ఎంపీ ల్యాడ్స్ నిధులు మంజూరు

సదుం: మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి నిధులను మంజూరు చేసినట్టు జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప సోమవారం తెలిపారు. స్థానిక మహాత్మా జ్యోతిబా పూలే బాలుర గురుకుల పాఠశాలలో ఆర్వో ప్లాంటు ఏర్పాటుకు రూ.3 లక్షలు, జెడ్పీ ఉన్నత పాఠశాలకు ఆరు కంప్యూటర్లు, ఉపకరణాల కోసం రూ.2 లక్షలు, రొంపిచెర్ల మండలం దద్దలవారిపల్లెలో మోటారు, పైపులైన్ ఏర్పాటుకు రూ.2 లక్షలు ఎంపీ ల్యాడ్స్ కింద మంజూరు చేసినట్టు చెప్పారు.

నేడు వలంటీర్లకు అవార్డులు

కుప్పం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం వలంటీర్లకు అవార్డులను ప్రదానం చేయనున్నట్టు మున్సిపల్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీనివాసులు, ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్ ముఖ్య అతిథులుగా హాజరవుతారని, అందరూ పాల్గొని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ నాయకులు కోరారు.

వందపడకల ఆస్పత్రికి మహర్దశ

- రూ.16 కోట్లతో అదనపు భవనాల నిర్మాణం
- కొత్తగా ఐదు బ్లాక్‌లు
- ఇన్‌పేషెంట్లకు వంద పడకలు సిద్ధం
- కొత్త హంగులతో కార్పొరేట్ ఆస్పత్రిని తలపిస్తున్న వైనం
- వచ్చే నెలాఖరుకు ప్రారంభం



పలమనేరు ఏరియా ఆస్పత్రికి అనుసంధానంగా అదనంగా నిర్మిస్తున్న భవనాలు





కొత్త ఆస్పత్రి భవనంలో లోపల సౌకర్యవంతమైన హాళ్లు, గదులు

ఒకప్పుడు ప్రభుత్వాసుపత్రిలో మెరుగైన సేవలు పేదలకు అందని ద్రాక్షగా ఉండేవి. ఆస్పత్రుల్లో సరైన సౌకర్యాలు లేక రోగులు పడే ఇబ్బందులు వర్ణనాతీతం. అంతేకాకుండా వైద్యులు, మందుల కొరత పీడించేవి. ప్రసవ నొప్పులతో వచ్చిన గర్భిణులకు సేవలందకపోవడం.. సరైన వైద్యం అందక మరణించిన వారి దేహాలతో ప్రజాసంఘాలు చేసిన ధర్నాలు చేసిన ఉదంతాలు కూడా ఉన్నాయి. ఇదంతా టీడీపీ పాలనలో వైద్యరంగం దుస్థితి. అయితే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక వైద్యరంగానికి సైతం పెద్దపీట వేసింది. నాడు–నేడు పథకం కింద కోట్ల రూపాయల వ్యయంతో ఆస్పత్రుల రూపురేఖలు మార్చేసింది. కార్పొరేట్ ఆస్పత్రులకు తీసిపోని విధంగా వైద్యసేవలు, సదుపాయాలు అందులోకి తీసుకువస్తోంది.

–పలమనేరు

ఇదిగో సాక్ష్యం

పట్టణంలోని ఏరియా ఆస్పత్రిని గత టీడీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. దీంతో కాంగ్రెస్ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 50 పడక ఆస్పత్రిని నిర్మించారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం ఈ ఆస్పత్రి అభివృద్ధిని విస్మరించింది. ప్రస్తుత ప్రభుత్వంఈ ఆస్పత్రిని వందపడకల స్థాయికి పెంచి, నాడు–నేడు ద్వారా నాబార్డ్ 25 ట్రాంచ్ నిధుల కింద రూ.16 కోట్లను 2020లో మంజూరు చేసింది. ఈ పనులను ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఎంఎస్ కేఎంవీ ప్రాజెక్ట్స్ లిమిటెడ్ ఈ పనులను ఇప్పటికే 90శాతం పూర్తి చేసింది. వచ్చే నెలాఖరు నాటికి పనులు పూర్తి చేసే దిశగా అధికారులు పనులు చేయిస్తున్నారు.

కొత్తగా ఐదు బ్లాకులు

ఇప్పటికే ఆస్పత్రిలోని ఐదు బ్లాకులతో పాటు అదనంగా మరో ఐదు బ్లాకులు ఏర్పాటు చేస్తున్నారు. అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, ఆయుష్ విభాగం, ఐసీటీసీ, క్యాజువాలిటీ, బర్న్స్ యూనిట్, ఐసోలేషన్ వార్డు, 21 బెడ్లతో ప్రత్యేక చిన్నపిల్లల విభాగం, పోస్ట్ ఆపరేటివ్ వార్డ్, ప్రత్యేకంగా 21 బెడ్లతో లేబర్ బ్లాక్, ఓటీ కాంప్లెక్స్, రేడియాలజీ ల్యాబ్స్, ఆర్థో, జీఎస్ అండ్ జీఎం, ఐ అండ్ ఈఎన్‌టీ పది బెడ్లు, పే రూమ్స్, బ్లడ్ బ్యాంకు, క్యాంటీన్, బయోమెడికల్ వేస్ట్, మార్చురీల ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే ఆక్సిజన్ ప్లాంట్ పనులు పూర్తయ్యాయి.

వంద పడకలతో రోగులకు సేవలు

వందపడకల ఆస్పత్రిగా పేరున్నప్పటికీ ఇన్‌పేషెంట్లకు 50 బెడ్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. కొత్త భవనాల నిర్మాణంతో వందబెడ్లు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానున్నాయి. ప్రస్తుతానికి ఆస్పత్రిలో మొత్తం వైద్యుల పోస్టులు 23కాగా ఆరు ఖాళీలున్నాయి. వీటిని సైతం కొత్త భవనాల ప్రారంభానికల్లా భర్తీ చేయనున్నారు. ఈ భవనాలు అందుబాటులోకి వస్తే సేవలు రెట్టింపయ్యే అవకాశం రోగుల తాకిడి కూడా పెరగవచ్చని భావిస్తున్నారు.

ఏరియా ఆస్పత్రి సేవలపై రిమార్క్ నిల్



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వైద్యరంగానికి ప్రాధాన్యత ఇస్తోంది. ఈ ఆస్పత్రిలో నిత్యం 500 ఓపీలున్నాయంటే సేవలు ఎలా ఉంటాయో అర్థం చేసుకోవచ్చు. ఆస్పత్రిలో ఇన్‌పేషెంట్లు సగటు 70 వరకూ ఉంటున్నారు. అలాగే నెలకు సగటున 70కిపైగా శస్త్రచికిత్సలు చేస్తున్నాం. కొత్త భవనాలు అందుబాటులో వస్తే ఇదో కార్పొరేట్ ఆస్పత్రి సేవలను మించడం ఖాయం.

–డాక్టర్ హరగోపాల్, ఆస్పత్రి సూపరిండెంటెండెంట్

గతానికి.. ఇప్పటికీ తేడాను జనం గమనించారు



గత టీడీపీ పాలనలో ఇదే ఆస్పత్రి నిర్లక్ష్యానికి గురైంది. రోగులకు సక్రమంగా సేవలందేవి కాదు. ఇప్పుడు పరిస్థితి మారింది. ఆస్పత్రి వద్ద రోగులు, వారి కుటుంబీకుల నుంచి ఒక్క ఫిర్యాదు కూడా లేదు. తరచూ ఆస్పత్రిని ఎమ్మెల్యే వెంకటేగౌడ తనిఖీ చేస్తుంటారు. కోవిడ్ సమయంలో రోగులకు మంచి సేవలను ఇక్కడ అందించాం. అందుతున్న వైద్యసేవలపై స్థానికులు సంతృప్తి చెందుతున్నారు.

–చెంగారెడ్డి, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ కో–చైర్మన్

మాది చేతల ప్రభుత్వం



లబ్ధిదారులకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

- రూ.కోట్ల నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు
- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే వెంకటేగౌడ

గంగవరం: తమది చేతల ప్రభుత్వమని, ఇచ్చిన హామీలను నెరవేర్చి రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారని ఎమ్మెల్యే వెంకటేగౌడ అన్నారు. మండలంలో పత్తికొండ గ్రామ సచివాలయ పరిధిలోని గోవిందశెట్టిపల్లె, అటుకురాళ్లపల్లె, పెద్దినేపల్లె, బెస్తగానిపల్లె గ్రామాల్లో సోమవారం గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆయన పలకరించారు. నాలుగేళ్ల పాలనలో ప్రజలకు చేకూరిన లబ్ధిని సంక్షేమ బావుటా బుక్‌లెట్లతో ఆయన వివరించారు.

ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు

గోవిందశెట్టిపల్లె, అటుకురాళ్లపల్లె గ్రామాల్లో సిమెంటు రోడ్లు వేయాలని గ్రామస్తులు ఎమ్మెల్యేను కోరారు. దీనిపై ఆయన స్పందించారు. జీజీఎంపి నిధులతో సీసీ రోడ్లు వేయిస్తామన్నారు. గ్రామాల్లో ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తెస్తే పరిష్కరిస్తానన్నారు. గత ప్రభుత్వం మాటలకే పరిమితమైతే తమ ప్రభుత్వం చేతల్లో చూపిస్తుందని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాధనకు నిర్విరామంగా కృషి చేస్తామన్నారు. తమ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యత నిస్తూ ఎంతో చేస్తున్నా ప్రతిపక్షాలు మాత్రం నిరంతరం దుష్ప్రచారం చేస్తున్నాయని, ప్రజలు మరోసారి ప్రతిపక్షాలకు బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డి, మండల పార్టీ కన్వీనర్ మోహన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, ఎంపీపీ వెంకటరమణ, నాయకులు చంద్రప్ప, శ్రీరాములురెడ్డి, గిరిరాజారెడ్డి, సిద్ధప్ప, సర్పంచ్ రవినాయుడు, ఎంపీటీసీ సూరిబాబు, వైస్ ఎంపీపీ ఆదాం బాషా, వివిధ శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు కూడా ఇదే పంచాయతీలో..

మంగళవారం కూడా ఇదే పంచాయతీలో ఎమ్మెల్యే పర్యటిస్తారని పార్టీ మండల కన్వీనర్ తెలిపారు. పత్తికొండలో గ్రామ సచివాలయం, ఆర్‌బీకే భవనాలను ప్రారంభించిన అనంతరం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహిస్తారని చెప్పారు.

ప్రజల చెంతకు ప్రభుత్వ సేవలు



సంక్షేమ బావుటా బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు ఇస్తున్న ఎమ్మెల్సీ భరత్

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్సీ భరత్

రామకుప్పం: ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలను అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కిందని చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ అన్నారు. మండలంలోని సింగసముద్రం పంచాయతీలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ఆయా కుటుంబాల వ్యక్తులు పొందిన సంక్షేమ పథకాల లబ్ధిని బుక్‌లెట్లతో వివరించారు. సమస్యలపై ఆరా తీశారు. ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను సంబంధిత అధికారులు పరిష్కరించాలని ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మరిన్ని నిధులను కేటాయించనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని, నవరత్నాలతో అర్హులైన అన్ని వర్గాల ప్రజలు లబ్ధి పొందుతున్నారని, తద్వారా ప్రజల ఆదాయం పెరిగిందన్నారు. అలాగే ప్రభుత్వ సేవలను ప్రజల మరింత చేరువ చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు నితిన్ రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, పార్టీ కో–కన్వీనర్ చంద్రారెడ్డి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, సర్పంచ్ చిన్నతాయమ్మ, నేతలు జయప్ప, సుబ్బారెడ్డి, జాబీర్, సతీష్, చంద్రమోహన్ రెడ్డి, కేశవ రెడ్డి, బోర్‌వెల్ చెంగారెడ్డి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాధాకృష్ణ, ఎస్ఐ కృష్ణయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జగనన్న ఆణిముత్యాలకు ప్రోత్సాహకాలు



మంగళంపేటలో విద్యార్థులకు ప్రోత్సాహకాలు, తల్లిదండ్రులకు సన్మానం

పులిచెర్ల(కల్లూరు): ఇటీవల వెలువడిన పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ప్రభుత్వం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా నగదు ప్రోత్సాహకాలను ఇస్తోందని ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి తెలిపారు. మంగళంపేట హైస్కూల్లో ఉత్తీర్ణతలో మొదటి, ద్వితీయ, తృతీయస్థానం పొందిన యామిని, ప్రియదర్శిని, అనుష్కకు ప్రభుత్వ ప్రోత్సాహకాలతో పాటు జిల్లా వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి, స్థానిక నాయకుడు రాయల్ మోహన్ తనతండ్రి స్వర్గీయ చలపతి జ్ఞాపకార్థం మొదటి స్థానం పొందినవారికి రూ.5,116, ద్వితీయ స్థానం వారికి రూ.3,116, తృతీయ స్థానం వారికి రూ.1,116 అందజేశారు. అనంతరం ఆ విద్యార్థుల తల్లిదండ్రులను సన్మానించారు. ఎంఈఓ సిద్ధరామయ్య, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు నాగరాజ ప్రసాద్, సర్పంచ్‌లు మధు, వాసుదేవరెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ మస్తాన్, లక్ష్మీపతి, హెచ్ఎం ఫజుల్లా తదితరులు పాల్గొన్నారు.

22న మండల మీట్

పుంగనూరు: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 22న మండల సర్వసభ్య సమావేశం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశాల మేరకు మండలంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు, లబ్ధిదారుల వివరాలతో పాటు పారదర్శకమైన పరిపాలనపై పూర్తి వివరాలతో కూడిన బుక్‌లెట్ అజెండాను విడుదల చేస్తున్నామని తెలిపారు. సభ్యులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

జగనన్న సురక్షపై అవగాహన కల్పించండి



శిక్షణా తరగతుల్లో సచివాలయ ఉద్యోగులు

రొంపిచెర్ల: జగనన్న సురక్ష పథకంపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ రాజేంద్ర అన్నారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామసచివాలయ ఉద్యోగులకు ఒకరోజు శిక్షణా తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై 1 నుంచి ప్రజలకు కావాల్సిన అన్ని రకాల సర్టిఫికెట్లను ఇళ్ల వద్దకే తీసుకుని వెళ్లి ఇవ్వడం జరుగుతుందన్నారు. నేటి నుంచి వలంటీర్లు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు కావాల్సిన సర్టిఫికెట్లపై అర్జీలను తీసుకోవాలన్నారు. మండలస్థాయి అధికారులతో కలసి గ్రామాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి సర్టిఫికెట్లను ఉచితంగా పంపిణీ చేస్తామని తెలిపారు. కుల, మరణ, ఆదాయ, వివాహ, జనన, పంట సాగు మ్యుటేషన్ వంటి సర్టిఫికెట్లను ఇస్తామని తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బైరెడ్డిపల్లెలో..

బైరెడ్డిపల్లె: స్థానిక రాయల్‌మహల్‌లో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమంపై ఎంపీడీఓ రాజేంద్ర బాలాజీ అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ, మండలంలోని ప్రతి సచివాలయంలో వారంలో 3 రోజుల పాటు క్యాంపులు నిర్వహిస్తామన్నారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు దీనిని విజయవంతం చేయాలన్నారు.

భూపట్టాల కోసం వినతి



జేసీ కార్యాలయం వద్ద దళిత నాయకులు

సదుం: మండలంలోని ఊటుపల్లె, తిమ్మానాయనపల్లె పరిధిలోని నిరుపేద దళిత రైతులకు భూపట్టాలను అందజేయాలని చిత్తూరులో సోమవారం వినతిపత్రాలు అందజేసినట్టు దళితసంఘం నాయకులు తెలిపారు. ఎస్సీ స్టేట్ కమిషన్ మెంబరు మధుప్రకాష్‌కు ఈ రెండు రెవెన్యూ గ్రామాల పరిధిలో సుమారు 83 ఎకరాలను వందమంది రైతులకు పట్టాలు అందజేసేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందించామన్నారు. అలాగే జాయింట్ కలెక్టరు శ్రీనివాస్‌కు వినతిపత్రం ఇవ్వగా ఆయన సానుకూలంగా స్పందించారని వారు వెల్లడించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి, మండల అధ్యక్షుడు సీతాపతి, స్టేట్ కన్వీనర్ మధు, రామచంద్రయ్య, రెడ్డెప్ప, నరసింహులు, వినోద్, రవి పాల్గొన్నారు.

తపాలా పథకాలపై అవగాహన



మాట్లాడుతున్న పలమనేరు డివిజన్ ఆఫీసర్ మదన్‌మోహన్

బైరెడ్డిపల్లె: తపాలా సేవింగ్స్, తపాలా జీవిత బీమా పాలసీలను సద్వినియోగం చేసుకోవాలని పలమనేరు డివిజనల్ పోస్టల్ ఆఫీసర్ మదన్‌మోహన్ కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన కొత్త పొదుపు పథకాలపై స్థానిక వెలుగు సమైఖ్య కేంద్రంలో సోమవారం మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, మహిళలు ఆర్థికంగా ఎదగడానికి తపాలా శాఖలో కొత్తపొదుపు పథకాలను ప్రవేశపెట్టారన్నారు. ఖాతా తెరవడానికి మధ్య 3 నెలల వ్యవధిలో ఎన్ని ఖాతాలైనా చేసుకోవచ్చన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఖాతాలను ముందుగానే మూసివేయచ్చునన్నారు. మొబైల్ బ్యాంకింగ్, ఏటీఎం సౌకర్యాలు కూడా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో బైరెడ్డిపల్లె పోస్ట్‌మాస్టర్ కుమారస్వామినాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

రాకేష్ మాస్టర్ మృతికి సంతాపం

బైరెడ్డిపల్లె: ప్రముఖ కొరియోగ్రాఫర్ రాకేష్ మాస్టర్ మృతికి బైరెడ్డిపల్లె కళా తరంగిణి సంగీత, నృత్య శిక్షణ కేంద్రంలో సోమవారం నివాళులు అర్పించారు. ఆ సంస్థ వ్యవస్థాపకుడు రాజేష్‌బాబు మాట్లాడుతూ, వందలాది సినిమాలకు నృత్య దర్శకుడిగా పని చేసిన రాకేష్‌మాస్టర్ మృతి సినీరంగానికి తీరని లోటన్నారు. అనంతరం ఆయన మృతికి మౌనం పాటించి సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కళాతరంగిణి సంస్థ సభ్యులు మస్తాన్, రాజన్న, ఇస్మాయిల్, బాలాజి, గుణస్వామి, విద్యార్థులు పాల్గొన్నారు.

రాగి సాగుతో అధిక ఆదాయం



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ

రొంపిచెర్ల: రాగి పంట సాగుతో అధిక ఆదాయం పొందవచ్చని రొంపిచెర్ల–2 రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయశాఖ అధికారి వెంకటరమణ నాయక్ అన్నారు. సోమవారం ఆయన రైతు భరోసా కేంద్రంలో రాగి పంట సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. మండలంలో 750 ఎకరాల్లో రాగి పంట సాగు చేయాలని గుర్తించి ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు తెలిపారు. రాయితీతో రాగి విత్తనాలను రైతులకు ప్రభుత్వం అందించి, పంటను కూడా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. 7 ఏళ్లలోపు ఉన్న మామిడి తోటల్లో కూడా రాగి పంటను సాగు చేయవచ్చన్నారు. అలాగే వరికి బదులుగా రాగి పంటను సాగు చేస్తే అధిక ఆదాయం వచ్చే అవకాశం ఉందన్నారు.


డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తులు

పుంగనూరు: పట్టణంలోని ప్రభుత్వ శుభారాం డిగ్రీ కళాశాలలో డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ రాజశేఖర్ తెలిపారు. సోమ వారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 19 నుంచి 24 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. విద్యార్థులు పూర్తి వివరాలకు కళాశాలలో సంప్రదించాలని కోరారు.

ఆణిముత్యాలకు సన్మానం

పలమనేరు: మండలంలోని మొరం పంచాయతీ నక్కపల్లె ఉన్నత పాఠశాలలో సోమవారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. టెన్త్‌లో మంచి మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు, ప్రశంసాపత్రాలు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం రమణ, పేరెంట్స్ కమిటీ కమిటీ చైర్‌పర్సన్ లీలావతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులపంపిణీ



బాధితులకు చెక్కులను అందజేస్తున్న నేతలు

రొంపిచెర్ల: ప్రభుత్వం మంజూరు చేసిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి సోమవారం బాధితులకు అందజేశారు. చెంచెంరెడ్డిగారిపల్లె గ్రామ పంచాయతీ బెస్తపల్లెకు చెందిన హరిణికి రూ.50 వేలు, చిచ్చిలివారిపల్లె పంచాయతీ బండమీదపల్లెకు చెందిన కవితకు రూ.34 వేలును ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ కింద ఆర్థికసాయం మంజూరు చేసింది. కార్యక్రమంలో జెడ్పీటీసీ రెడ్డీశ్వర్‌రెడ్డి, మంత్రి పీఏ మునితుకారం, సింగిల్‌విండో అధ్యక్షుడు హరినాథరెడ్డి, సర్పంచ్ సుధారాణి, నాయకులు విజయశేఖర్, సూర్య నారాయణ రెడ్డి, రామనారాయణ రెడ్డి, కోటా వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకే పెద్దపీట



మాట్లాడుతున్న ఎంపీపీ యువరాజు

వి.కోట: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అన్నింటా మహిళలకే పెద్దపీట వేసిందని ఎంపీపీ యువరాజు అన్నారు. సోమవారం మండలంలోని స్త్రీశక్తి భవనంలో మండల సంఘమిత్రలకు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, వైఎస్సార్ ఆసరా, సున్నావడ్డీ, జగనన్న తోడు, అమూల్ డెయిరీ పాడి రైతులకు రుణాలు మొదలైన వాటిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో మహిళలు ఆర్థికాభివృద్ధి చెందేలా వారిలో చైతన్యం తేవాలన్నారు. అలాగే పథకాలు సద్వినియోగం చేసుకునేలా చూడాలని, లబ్ధిదారులకు సకాలంలో రుణాలు మంజూరయ్యేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

చౌడేపల్లె ఎంఈఓగా తిరుమల



తిరుమల

చౌడేపల్లె: మండల ఎంఈఓ–2గా ఆర్‌సీ తిరుమల సోమవారం సాయంత్రం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈమె శాంతిపురం మండలం సి.బండపల్లె ఉన్నత పాఠశాల హెచ్ఎంగా పని చేస్తూ పదోన్నతిపై చౌడేపల్లెకు వచ్చారు. ఆమె మాట్లాడుతూ బడిఈడు పిల్లలంతా బడిలో ఉండేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. అలాగే ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా విద్యావ్యవస్థను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్తామన్నారు. ఆమెను ఉపాధ్యాయులు స్వాగతం పలికి సన్మానించారు.

ఎంఈఓ–2గా రెడ్డెన్నశెట్టి



రెడ్డెన్నశెట్టి

పుంగనూరు: మండల రెండవ విద్యాశాఖాధికారిగా హెచ్ఎంగా పని చేస్తున్న రెడ్డెన్నశెట్టిని నియమిస్తూ డీఈఓ విజయేంద్రరావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వం మండలానికి ఇద్దరు ఎంఈఓలను నియమించడంలో భాగంగా రెండవ ఎంఈఓగా రెడ్డెన్నశెట్టిని నియమించారు. తొలి ఎంఈఓగా కేశవరెడ్డి కొనసాగుతున్నారు.

ఎంఈఓ–2గా మురుగేష్



రెడ్డెన్నశెట్టి

వి.కోట: మండలంలోని పత్రపల్లె ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మురుగేష్ ఉద్యోగోన్నతిపై మండల రెండవ ఎంఈఓగా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సహచర ఉపాధ్యాయులు ఆయన్ను అభినందించారు. ఇదే ప్రాంతంలో జన్మించిన మురుగేష్ హెచ్ఎంగా సమర్థవంతంగా పనిచేశారని, అదేరీతిలో ఎంఈఓగా కూడా రాణించాలని ఆకాంక్షించారు.

విద్యాసామర్థ్యాలు పెంచాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ

పలమనేరు: నాడు–నేడు మనబడుల ద్వారా అన్ని ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసిన నేపథ్యంలో ఉపాధ్యాయులు విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాలను పెంపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలమనేరు ఎంఈఓ లీలారాణి అన్నారు. పట్టణంలోని ఇందిరమ్మ ఎంపీపీ స్కూలును సోమవారం ఆమె తనిఖీ చేశారు. టీఎల్ఎం మెటీరియల్‌తో విద్యాబోధన చేయాలని టీచర్లకు సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎమ్మార్సీలు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యాకానుక ఓ వరం



విద్యార్థులతో కలసి సంబరాలు నిర్వహిస్తున్న దళిత నాయకులు

పుంగనూరు: రాష్ట్రప్రభుత్వం అందిస్తున్న జగనన్న విద్యాకానుక పేద విద్యార్థులకు ఓ వరమని ఏపీ రాష్ట్ర దళిత సంక్షేమ సేవాసంఘం అధ్యక్షుడు ఎం.శంకరప్ప అన్నారు. సోమవారం ఆయన పట్టణంలోని తూర్పుమొగశాల మండల పరిషత్ పాఠశాలలో విద్యార్థులు, దళిత నేతలు రాజు, గంగప్పతో కలసి కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న జగనన్న విద్యాకానుక కిట్లు ఎంతో నాణ్యతతో ఉన్నాయని కొనియాడారు. కార్యక్రమంలో దళిత నాయకులు పాల్గొన్నారు.